
నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, శుక్రవారం 30 ఆగస్టు 2024 VIKARABAD


సర్పన్‌పల్లి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో జోరుగా సాగుతున్న నిర్మాణాలు

# చెరువులనూ వదల్లేదు..

## • ఆక్రమణకు గురైన వికారాబాద్, పరిగి, తాండూరు మున్సిపాలిటీల పరిధిలోని తటాకాలు

- వికారాబాద్ మున్సిపల్‌లోని శివసాగర్, సర్పన్‌పల్లి, కొంపల్లి చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు కబ్జా
- సర్పన్‌పల్లి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా వెలిసిన రిసార్ట్స్
- చెరువు మధ్యలో ప్రత్యేకంగా రూములు ఏర్పాటు చేసిన వైల్డర్‌నెస్ రిసార్ట్స్ నిర్వాహకులు
- ఒక రూమ్‌ను సీజ్ చేసి చేతులు దులుపుకొన్న ఇరిగేషన్ అధికారులు
- యథేచ్ఛగా చెరువు స్థలాల అన్యాక్రాంతం
- పరిగిలో రికార్డులకే పరిమితమైన కొత్త చెరువు


సర్పన్‌పల్లి చెరువు మధ్యలో ప్రత్యేక రూమ్‌లు ఏర్పాటు చేసిన వైల్డర్‌నెస్ రిసార్ట్స్ నిర్వాహకులు

వికారాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలోని చెరువులు, ప్రాజెక్టులు కబ్జాకు గురయ్యాయి. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు మున్సిపాలిటీల్లోని చెరువులను కొందరు యథేచ్ఛగా చెరపట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని చేపట్టి చెరువులను అభివృద్ధి చేస్తే, వాటి హద్దులను గుర్తించాల్సిన రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని ఆక్రమణదారులు వికారాబాద్, పరిగి, తాండూరు మున్సిపాలిటీల పరిధిలోని పలు చెరువులను కబ్జా చేసి, పలు భవనాలను నిర్మించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లతోపాటు వ్యవసాయానికి నీరందించే చెరువులను ఆక్రమించారు. కొన్నేండ్లుగా చెరువుల ఆక్రమణ జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ శాఖల అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా చెరువులను ఆక్రమించిన ప్రాంతాల్లో రిసార్ట్స్, ఫామ్‌హౌస్‌లు, ఇండ్ల నిర్మాణాలకు గ్రామపంచాయతీ, ఆయా మున్సిపాలిటీల అధికారులు అనుమతులు ఇస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ నగరంలో హైడ్రా.. చెరువులు, కుంటల్లోని కబ్జాలకు చెక్ పెడుతూ ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుండడంతో జిల్లాలో చెరువులను ఆక్రమించుకున్న వారి గుండెల్లో గుబులు మొదలైంది. జిల్లాలోని చెరువులను కాపాడేందుకు 'హైడ్రా' స్థాయిలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లావాసులు కోరుతున్నారు.


సర్పన్‌పల్లి చెరువులో అక్రమంగా ఏర్పాటు చేసిన నాలుగు రూమ్‌లలో ఒక రూమ్‌ను సీజ్‌చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

### వికారాబాద్ మున్సిపల్ పరిధిలో..

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివసాగర్, సర్పన్‌పల్లి, కొంపల్లి చెరువులు, ప్రాజెక్టులు కబ్జాకు గురయ్యాయి. ప్రధానంగా మిషన్ భగీరథకు ముందు వికారాబాద్ మున్సిపాలిటీకి తాగు నీరందించే శివసాగర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు అన్యాక్రాంతమయ్యాయి. శివసాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే పట్టా భూమంటూ ఓ ఫాంహౌస్‌ను కొందరు ఏర్పాటు చేశారు. స్పష్టంగా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఫాంహౌస్ ఉన్నా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా శివసాగర్ బఫర్ జోన్‌లోనూ అక్రమంగా లేఅవుట్లు వెలిశాయి.. ఇందుకు వికారాబాద్ మున్సిపల్ అధికారులే అనుమతులివ్వడం గమనార్హం. శివసాగర్ చెరువు ఫీడర్ చానెళ్లను పూడూరు మండలం నుంచి వికారాబాద్ మున్సిపాలిటీ వరకు కబ్జాదారులు మింగేశారు. అదేవిధంగా ఒకప్పుడు వ్యవసాయానికి సాగు నీరందించిన సర్పన్‌పల్లి ప్రాజెక్టు ఇప్పుడు అక్రమ వ్యాపారుల దోపిడీకి కల్పతరువైంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆ చెరువు సమీపంలోకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. అంతేకాకుండా ఆ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా అనేక రిసార్ట్స్ వెలిశాయి. వైల్డర్‌నెస్ రిసార్ట్స్ నిర్వాహకులైతే ఏకంగా చెరువులోనే దాని కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అయితే మూడు నెలల కిందట అనుమతుల్లేవంటూ వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌తోపాటు పలు రిసార్ట్స్‌లను మూసేసిన అధికారులు.. ముడుపులు అందిన వెంటనే వారే దగ్గరుండి తెరిపించారని ఆరోపణలున్నాయి. ఏకంగా చెరువులోనే నాలుగు ప్రత్యేకంగా రూంలు ఏర్పాటు చేసి అక్రమంగా వ్యాపారం చేస్తున్నా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు గురువారం చెరువులో ఏర్పాటు చేసిన ఒక రూంను సీజ్ చేసి చేతులు దులుపుకొన్నారు. అదేవిధంగా కొంపల్లి చెరువు కూడా ఆక్రమణకు గురైంది. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లనూ అక్రమార్కులు చెరపట్టారు.

### పరిగి మున్సిపాలిటీలో మరీ దారుణం

పరిగి మున్సిపల్‌లోని కొత్త చెరువు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఒకప్పుడు నిండుకుండలా కనిపించిన ఈ చెరువు ప్రస్తుతం రికార్డులకే పరిమితమైనది. ఇప్పుడు ఎవరైనా చెరువుండేదని చెప్పినా నమ్మలేని పరిస్థితి నెలకొన్నది. ఆక్రమణలతో పూర్తిగా మాయమైంది. ప్రస్తుతం అక్కడ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. చెరువు మొత్తం ఆక్రమణకు గురైనా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. చెరువు మూలాల్లేకుండా చేసిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పరిగి మున్సిపాలిటీవాసులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఆనవాళ్లు కోల్పోయిన గొల్ల చెరువు

తాండూరు మున్సిపల్ పరిధిలోని గొల్ల చెరువు ఆక్రమణకు గురైంది. తాండూరు పట్టణానికి అనుకొని ఉన్న ఈ చెరువు కొద్ది కొద్దిగా మొత్తం అన్యాక్రాంతమైనది. అక్కడ అక్రమంగా నిర్మాణాలు వెలిసినా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడ ఇండ్ల నిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుతులు ఇవ్వడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


తీజ్ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

## గిరిజనుల సంస్కృతికి ప్రతీక తీజ్

- మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- గాన్గుమార్లతండాలో వైభవంగా జరిగిన వేడుక
- పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


నెత్తిన మొలకల బుట్టలతో యువతులు

కడ్తాల్, ఆగస్టు 29 : గిరిజనుల సంస్కృతీసంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గాన్గుమార్ల తండాలో గిరిజనులు నిర్వహించిన తీజ్ ఉత్సవంలో సబితారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో గిరిజనులు జరుపుకొనే తీజ్ పండుగకు ఎంతో ప్రాధాన్యమున్నదన్నారు. పూర్వకాలం నుంచి వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..గిరిజనులకు తీజ్ పండుగ ఎంతో ప్రీతికరమైనదన్నారు. అనంతరం యువతులు తయారు చేసిన మొలకల బుట్టలను ప్రజాప్రతినిధులు నెత్తిన ఎత్తుకున్నారు. సాయంత్రం యువతులు బుట్టలను ఎత్తుకొని డప్పు వాయిద్యాల మధ్య స్థానిక ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యువతీయువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆ బుట్టలను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, వెంకటేశ్, విజితారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు హన్మానాయక్, సేవ్యానాయక్, శంకర్‌నాయక్, శ్రీనూనాయక్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హంశ్యామోత్యానాయక్, రాములునాయక్, శేఖర్‌గౌడ్, నరేందర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ గిరిజన యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, నాయకులు వీరయ్య, లాయక్‌అలీ, భాస్కర్‌రెడ్డి, నర్సింహ, బీక్యానాయక్, బీచ్యానాయక్, యాదరిగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజూనాయక్, లక్పతినాయక్, భీమన్‌నాయక్, శంకర్, లక్ష్మణ్, హీరాసింగ్, రాజునాయక్, రతన్, పాండునాయక్, జగన్, సాయిలాల్, కిషన్, సక్రూనాయక్, భాస్కర్, తండావాసులు పాల్గొన్నారు.


మొలకలున్న బుట్టలను చెరువులో నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా వెళ్తున్న గిరిజనులు

# ప్రేమోన్మాది ఘాతుకం

## యువతిని చంపి.. తానూ ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన


దీప్నా తమాంగ్ (ఫైల్)


నిందితుడు రాకేశ్

శేరిలింగంపల్లి/మొయినాబాద్, ఆగస్టు 29 : గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ప్రేమోన్మాది దాడిలో ఓ యువతి మృతి చెందగా, అడ్డుకున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. నిందితుడు విద్యుత్తు తీగలు పట్టుకొని ఆత్మహత్యకు యత్నించి.. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం, కోచ్‌బీహార్ జిల్లా, లంకపార గ్రామానికి చెందిన దీప్నాతమాంగ్ (26) గోపన్‌పల్లితండాలో మరో ముగ్గురు యువతులతో కలిసి అద్దెకుంటున్నది. ఓ బ్యూటీపార్లర్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నది. ఆమె బెంగళూరులో పనిచేసిన సమయంలో బీదర్‌కు చెందిన రాకేశ్ (25)తో పరిచయం ఏర్పడింది. అతడు కూడా మాదాపూర్‌లోని హాస్టల్‌లో ఉంటూ.. మరో బ్యూటీపార్లర్‌లో పనిచేసేవాడు. ఇద్దరు మూడేండ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే కొంతకాలంగా దీప్నా మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే కారణంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి గోపన్‌పల్లి తండాలోని దీప్నాతమాంగ్ నివసిస్తున్న ఇంటికి వచ్చిన రాకేశ్.. మాట్లాడాలంటూ బయటకు పిలిచాడు. అప్పటికే తన వెంట తెచ్చుకున్న కత్తితో దీప్నాతమాంగ్‌పై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. 15 కత్తిపోట్లకు గురైన దీప్నా.. రక్తపుమడుగులో పడిపోయింది. అరుపులు విని అడ్డుకునేందుకు యత్నించిన ఆమె స్నేహితులు సావిత్రి, పునీత, కృష్ణ తమాంగ్‌లపైనా రాకేశ్ దాడి చేసి పరారయ్యాడు. బాధితుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు దీప్నాతోపాటు ఆమె స్నేహితులను దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే దీప్నా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దాడి అనంతరం రాకేశ్ బీదర్‌లో ఉంటున్న తన తల్లిదండ్రులకు ఇదే తన చివరి రోజు అంటూ మెసేజ్ పెట్టాడు. దీంతో రాకేశ్ తల్లిదండ్రులు కర్ణాటక పోలీసులను ఆశ్రయించారు. వారు ఇచ్చిన సమాచారంతో గచ్చిబౌలి పోలీసులు రాకేశ్‌కోసం గాలించగా..మొయినాబాద్‌లో ఉన్నట్లు అతడి సెల్‌ఫోన్ సిగ్నళ్ల ద్వారా గుర్తించారు. అక్కడి వెళ్లి చూసేసరికి విద్యుత్తు తీగలను పట్టుకొని సగం కాలిన గాయాలతో రాకేశ్ కనిపించాడు. నిందితుడిని చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించిన పోలీసులు.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 2న కలెక్టరేట్ల ముట్టడి

చిక్కడపల్లి, ఆగస్టు 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కులగణనను వెంటనే ప్రారంభించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం, బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కులగణనను వెంటనే ప్రారంభించాలని, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం కవాడిగూడలోని బీసీభవన్‌లో ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేశాచారి, బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్ తదితర నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు విక్రమ్‌గౌడ్, రాజేందర్, కనకాల శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాలయాపన కోసమే సర్వే

## రుణమాఫీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వే చేపట్టిందని కొడంగల్‌వాసుల మండిపాటు

- ప్రహసనంగా జరిగిన ప్రక్రియ... అన్ని అర్హతలున్నా వర్తించని మాఫీ
- సీఎం చెప్పింది ఒక్కటి.. చేస్తున్నది మరొకటని అన్నదాతల మండిపాటు
- బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ రైతన్నల ప్రదక్షిణలు

**ప్రభుత్వ ప్రకటనతో క్రాప్ లోన్ మాఫీ అవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. మాతో కలిసి బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారివి మాఫీ అయ్యాయి. కానీ.. అన్ని అర్హతలున్నా మావి మాత్రం మాఫీ కాలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన రూ.2 లక్షల రుణమాఫీ వేలాది మంది అన్నదాతలకు నిరాశను మిగిలించింది. కొడంగల్ సెగ్మెంట్‌లో మొత్తం 52,395 మంది రైతులుండగా.. మూడు విడతల్లో కలిపి 17,436 మందికి మాత్రమే మాఫీ వర్తించిందని పేర్కొంటున్నారు. కాగా గ్రామాల్లో బుధవారం నుంచి వ్యవసాయాధికారులు చేస్తున్న ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వేను ప్రభుత్వం కాలయాపన కోసమే చేపట్టిందని పలువురు మండిపడుతున్నారు.**




హస్నాబాద్ గ్రామంలో రుణమాఫీ కాని రైతు కుటుంబాల వివరాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

కొడంగల్, ఆగస్టు 29 : రైతుల పంట రుణాలను మాఫీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనది. ఆ ప్రక్రియను తూతూమంత్రంగా చేపట్టింది. అర్హతలున్నా మాఫీ వర్తించకపోవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీతో చాలామంది రైతులకు లబ్ధి జరిగిందని.. ప్రస్తుత ప్రభుత్వం కొర్రీలు, నిబంధనల పేరుతో అన్యాయం చేస్తున్నదని మండిపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రతి రైతుకూ రూ. రెండు లక్షల వరకు ఎలాంటి షరతుల్లేకుండా పంట రుణాలను మాఫీ చేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి రాగానే మాట తప్పాడని.. లేనిపోని అనేక నిబంధనలు, మెలికలు పెట్టి వేలాది మంది అన్నదాతలను ఆగం చేస్తున్నడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మూడు విడతలుగా చేసిన రుణమాఫీలో కొడంగల్ నియోజకవర్గంలో 30 శాతం మందికే రుణమాఫీ అయ్యిందని అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం స్పష్టమవుతున్నది. దీంతో మాఫీ కాని అన్నదాతలు బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అన్ని అర్హతలున్నా మా రుణాలు ఎందుకు మాఫీ కాలేదని వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 52,395 మంది రైతులుండగా.. అందులో మొదటి విడత రుణమాఫీలో 9,604 మంది రైతులకు, రెండో విడతలో 6,057 మందికి, మూడో విడతలో 1,775 మంది రైతుల రుణాలు మాఫీ అయినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. రూ.2 లక్షల పైగా అప్పు ఉన్న రైతులు మిగిలిన నగదును చెల్లిస్తేనే.. రూ. 2 లక్షల రుణమాఫీ వర్తిస్తుందని బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు చెప్పడంతో పై మొత్తాన్ని చెల్లించినా మా రుణాలు మాఫీ కాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కొనసాగుతున్న సర్వే

ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వేతో వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. రుణమాఫీ వర్తించని, రేషన్‌కార్డు లేని రైతుల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. వ్యవసాయాధికారుల వద్ద రైతులకు సంబంధించిన పూర్తి వివరాలున్నా అర్హులకు రుణమాఫీ కాలేదని.. ఇప్పుడు నిర్వహిస్తున్న ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వేతో అర్హత కలిగిన అందరి రుణాలు మాఫీ అవుతాయా..? అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ అంశాన్ని కాలయాపన చేసేందుకు ఈ సర్వేను చేపట్టిందని పలువురు రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరి రుణాలను ఎలాంటి షరతుల్లేకుండా మాఫీ చేయాని డిమాండ్ చేస్తున్నారు.



### ప్రతి రైతుకూ మాఫీని వర్తింపజేయాలి

పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ ఎలాంటి షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. మా ఇంట్లో నేను, నా భార్య, ఇద్దరు కొడుకులం కలిపి బొంరాస్‌పేట ఎస్‌బీఐలో రూ. 6.54 లక్షల పంట రుణం తీసుకున్నాం. కానీ, ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. అన్ని అర్హతలు న్నా మాఫీ కాకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. రుణమాఫీ కాని వారందరూ బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రైతులందరికీ ప్రభుత్వం న్యా యం చేయాలి.

**-కోట్ల యాదగిరి, ఏర్పుమళ్ల, బొంరాస్‌పేట మండలం**

### కేసీఆర్ హయాంలో అందరి రుణాలను మాఫీ చేశారు

కేసీఆర్ హయాంలో రైతులందరి రుణాలను మాఫీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ మాటల్లోనే ఉన్నది.. చేతల్లో లేదు. నేను కొడంగల్ ఎస్‌బీఐలో రూ.1.40 లక్షలు, నా కొడుకు దయాకర్ రూ. 90 వేలు పంటల సాగుకు తీసుకున్నాం. రేషన్‌కార్డును ప్రాతిపదికగా తీసుకున్నా ఇద్దరిలో ఒకరికైనా మాఫీ కావాలి. కానీ, ఇద్దరికీ కాలేదు. ఇదేం రుణమాఫీయో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు వరుసగా కష్టాలే ఎదురవుతున్నాయి. రుణమాఫీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కానీ జాబితాలు చూసిన తర్వాత నిరాశే ఎదురైంది.



**-గోవింద్‌రెడ్డి, రేగడిమైలారం, బొంరాస్‌పేట**

### రుణమాఫీకి షరతులు పెట్టడం బాధాకరం

వ్యవసాయ పనుల నిమిత్తం బ్యాంకులో క్రాప్ లోన్ తీసుకున్నా. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తున్నదని తెలిసి చాలా సంతోషించా. కానీ రేషన్ కార్డును ప్రామాణికంగా పెట్టి వేలాది మందికి రుణమాఫీని దూరం చేయడం బాధాకరం. కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు, నిబంధనలు పెట్టి అన్నదాతలను ఆగం చేయొద్దు. ఇచ్చిన మాట ను నిలబెట్టుకోవాలి. అందుకు రైతులందరి పంట రుణాలను మాఫీ చేయాలి



**- శ్యాంసుందర్, రైతు, కొడంగల్**